AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
16-10-2025 (Thursday) MAIN EDITION

## అదరగొట్టిన రూబికాన్ ఐపీవో




**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్‌లో రూబికాన్ ఐపీవో అదరగొట్టింది. గురువారం లిస్టయిన ఈ కంపెనీ ఇన్వెస్టర్లకు లాభాలను తెచ్చిపెట్టింది. ఫార్మాస్యూటికల్ సంస్థ అయిన రూబికాన్ రీసెర్చ్ రూ. 1,377.50 కోట్లను సమీకరించడం కోసం ఐపీవోకు వచ్చింది. కంపెనీ షేర్లు గురువారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టయ్యాయి. గరిష్ట ప్రైస్ బాండ్ వద్ద ఒక్కో షేరు ధర రూ. 485 కాగా.. రూ. 135 ప్రీమియంతో రూ. 620 వద్ద లిస్టయ్యింది. అంటే ఐపీవో ఇన్వెస్టర్లకు లిస్టింగ్ సమయంలోనే 27.84 శాతం లాభాలను అందించింది.

## నెస్లేలో భారీ లేఆఫ్‌లు..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** అతిపెద్ద ప్యాకేజ్డ్ ఫుడ్ కంపెనీ నెస్లే భారీగా ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. 16వేల మంది ఉద్యోగుల తొలగింపునకు సన్నాహాలు చేస్తున్నట్లు సంస్థ సీఈవో ఫిలిప్ నవ్రాటిల్ గురువారం వెల్లడించారు. రానున్న రెండేళ్ల కాలానికి ఈ తొలగింపు ఉంటుందని తెలిపారు. "ప్రపంచం మారుతోంది. దానికి తగ్గట్టే నెస్లే వేగంగా మారాలి. ఇది కఠిమైన నిర్ణయమే అయినప్పటికీ.. ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవడం ఆ మార్పులో భాగం" అని వెల్లడించారు.

## మోదీ దెబ్బకు పాక్ దిమ్మ తిరిగింది



**అక్షరటుడే, కర్నూల్ :** నమో అంటేనే విక్టరీ అని ఏపీ మంత్రి లోకేశ్ అన్నారు. కర్నూల్‌లోని నన్నూరులో గురువారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మోదీ ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతం అవుతుందన్నారు. మోదీ దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చారని కొనియాడారు. ఆయన దెబ్బకు పాకిస్తాన్ దిమ్మతిరిగిందన్నారు.

## చైనా కరెన్సీలో భారత్ చెల్లింపులు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** రష్యా చమురు కొనుగోళ్లకు చైనా కరెన్సీ యువాన్‌లో భారత్ చెల్లింపులు చేస్తోంది. ఈ విషయాన్ని రష్యా ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ వెల్లడించారు. అయితే అది స్వల్ప మొత్తంలోనేనని, ఎక్కువశాతం లావాదేవీలు రూబుల్స్‌లోనే జరుగుతున్నాయని స్థానిక మీడియా సంస్థకు వెల్లడించారు.

## దీపక్‌రెడ్డికి బీఫామ్ అందజేత




**అక్షరటుడే, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ తన అభ్యర్థిగా లంకల దీపక్‌రెడ్డిని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయనకు గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు బీ ఫామ్ అందజేశారు. ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## వెంకటేశ్, రానా కోర్టుకు రావాల్సిందే..



**అక్షరటుడే, హైదరాబాద్:** ఫిల్మ్‌నగర్ దక్కన్ కిచెన్ హోటల్ కూల్చివేత కేసుపై నాంపల్లి కోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సినీ నటులు దగ్గుబాటి వెంకటేశ్, రానా, అభిరామ్, సురేశ్ బాబు నవంబర్ 14న తప్పనిసరిగా కోర్టుకు రావాలని ఆదేశించింది. పర్సనల్ బాండ్ సమర్పించేందుకు కచ్చితంగా రావాల్సిందేనని స్పష్టం చేసింది. న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించి దక్కన్ హోటల్ కూల్చివేశారన్న ఆరోపణలతో సినీనటులు దగ్గుబాటి వెంకటేశ్, రానా, అభిరామ్‌తోపాటు నిర్మాత దగ్గుబాటి సురేశ్‌పై గతంలో కేసు నమోదైన విషయం తెలిసిందే.


## వాట్సప్‌లో శ్రీవారి దర్శన టికెట్ల సమాచారం..




**అక్షరటుడే, తిరుమల:** ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సా ప్ గవర్నెన్స్‌లో మరిన్ని సేవలను జోడించింది. తాజాగా, టీటీడీకి సంబంధించిన నాలుగు రకాల ముఖ్య సేవలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా భక్తులకు అందుబాటులోకి తెచ్చింది. ఇకపై వసతి, దర్శనం, ఇతర కీలక సమాచారాన్ని భక్తులు సులభంగా తెలుసుకోవచ్చు. ఇందుకోసం 95523 00009 నంబరును కేటాయించింది.

**రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ ప్రభుత్వం తెచ్చిన జీవో 9పై హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ సర్కార్ దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. అక్కడ కూడా నిరాశే ఎదురైంది. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని ధర్మాసనం సూచించింది. దీంతో స్థానిక ఎన్నికలపై సందిగ్ధత నెలకొంది.**
– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# సర్కారుకు సుప్రీంలో చుక్కెదురు..



- రాష్ట్ర ప్రభుత్వానికి షాకిచ్చిన న్యాయస్థానం..
- బీసీ రిజర్వేషన్లపై పిటిషన్ కొట్టివేత

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ ఇటీవల ప్రభుత్వం జీవో జారీ చేసింది. తాము అధికారంలోకి వస్తే బీసీలకు విద్యా, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు అసెంబ్లీలో బిల్లులు ఆమోదించినా.. రాష్ట్రపతి, గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో జీవో ద్వారా స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే ఆ జీవోను సవాలు చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లను విచారించిన కోర్టు బీసీ రిజర్వేషన్ల జీవోపై స్టే ఇచ్చింది. దీంతో హైకోర్టు నిర్ణయంపై ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించింది.

### అక్కడే తేల్చుకోండి..

హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది. దీనిపై గురువారం ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున సీనియర్ లాయర్ అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపించారు. కుల గణన ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేసినట్లు తెలిపారు. హైకోర్టు విధించిన స్టేను ఎత్తివేయాలని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు కోరారు. కేసు హైకోర్టులో పెండింగ్ ఉందని, బీసీ బిల్లుకు అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయని తెలిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ రిజర్వేషన్లు 50 శాతం మించకూడదనే సుప్రీం తీర్పులు స్పష్టంగా ఉన్నాయన్నారు. అయితే ప్రభుత్వ వాదనలను అంగీకరించని కోర్టు పిటిషన్‌ను కొట్టేసింది. అవసరం అయితే పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ప్రస్తుతం హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో అక్కడే తేల్చుకోవాలని సూచించింది.

### ఎన్నికలు జరిగేనా..

బీసీ రిజర్వేషన్ల జీవోకు అనుగుణంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడింది. అయితే హైకోర్టు జీవో నంబర్ 9పై స్టే విధించడంతో ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికల ప్రక్రియను వాయిదా వేసింది. తాజాగా సుప్రీంలో సైతం ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగలడంతో స్థానిక ఎన్నికలపై సందిగ్ధత నెలకొంది.

**వరుస వివాదాలు మంత్రి కొండా సురేఖను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తరచూ ఒకో వివాదంలో ఇరుక్కుని అబాసు పాలవుతున్నారు. గతంలో ఎమ్మెల్యేలపై వ్యాఖ్యలు చేయగా.. ఇటీవల పొంగులేటితో వివాదం తలెత్తింది. ఈ ఎపిసోడ్ ముగియకముందే.. తాజాగా మరో వివాదంలో చిక్కుకున్నారు. ఆమె ఓఎస్డీ సుమంత్‌ను తొలగించడంతో పాటు అతడిని అరెస్ట్ చేసేందుకు మంత్రి ఇంటికి టాస్క్‌ఫోర్స్ పోలీసులు మఫ్టీలో వెళ్లడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. వారిని మంత్రి కుమార్తె అడ్డుకోవడం కాంగ్రెస్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది.**
–అక్షరటుడే, హైదరాబాద్

# కొండంత చిక్కుల్లో మంత్రి..



- సురేఖను వరుసగా చుట్టుముడుతున్న వివాదాలు
- తాజాగా రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన ఓఎస్డీ అరెస్ట్ వ్యవహారం

మంత్రి పదవి చేపట్టిన నాటి నుంచి కొండా వ్యవహారంతో అటు ప్రభుత్వం, ఇటు కాంగ్రెస్ పార్టీ ఇరకాటంలో పడుతున్నాయి. గతంలో ఓ హీరోయిన్ విషయంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అనంతరం ఆమె భర్త కొండా మురళి సొంత పార్టీ ఎమ్మెల్యేలపై ఆరోపణలు చేశారు. దీంతో వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇప్పటికే కొండా సురేఖకు వ్యతిరేకంగా ఏకం అయ్యారు. ఇటీవల ఆమె భర్త మురళి పొంగులేటిపై హైకమాండ్‌కు ఫిర్యాదు చేయడంతో వార్తల్లో నిలిచారు.

కాగా.. మంత్రి కొండా సురేఖ ఇంటి వద్ద బుధవారం రాత్రి హైడ్రామా చోటు చేసుకుంది. ఆమె ఇంటికి వచ్చిన టాస్క్‌ఫోర్స్ పోలీసులను మంత్రి కుమార్తె సుష్మిత అడ్డుకున్నారు. కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్‌ను ప్రభుత్వం ఇటీవల తొలగించిన విషయం తెలిసిందే. ఆయనపై పలు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో సుమంత్ మంత్రి ఇంట్లో ఉన్నారని తెలుసుకున్న పోలీసులు ఆయనను అరెస్ట్ చేయడానికి వెళ్లారు. వారిని గేటు వద్దే మంత్రి కుమార్తె అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాశమైంది. ఇలా తరచూ తలెత్తుతున్న వివాదాలు కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారాయి.

## హైకోర్టులో బీఆర్ఎస్‌కు షాక్

**అక్షరటుడే, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ నియోజక వర్గం పరిధిలో ఓటు చోరీ జరిగిదంటూ బీఆర్ఎస్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం ప్రస్తుతం జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఇప్పటికే ఓటరు జాబితాను ఈసీ రివిజన్ చేస్తోందని పేర్కొంది. ఈ పిటిషన్‌లో ప్రత్యేక ఆదేశాలు ఏమీ ఇవ్వాల్సిన అవసరం లేదని విచారణను ముగించింది.

## హాట్‌టాపిక్‌గా సోనాక్షి సిన్హా..



**బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హా మళ్లీ వార్తల్లో నిలిచారు. ఆమె ప్రెగ్నెన్సీ రూమర్స్ మరోసారి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. గతేడాది తన ప్రియుడు జహీర్ ఇక్బాల్‌ను వివాహం చేసుకున్న సోనాక్షి ఇటీవల తన భర్తతో కలిసి విక్రమ్ ఫడ్నీస్ ఫ్యాషన్ షోకు హాజరయ్యారు. ఈ ఈవెంట్‌లో సోనాక్షి లూజ్ అనార్కలి సూట్‌లో మెరిసి ఫొటోలకు ఫోజులిచ్చారు. అయితే ఆమె ఆ డ్రెస్‌లో "బేబీ బంప్ కవర్ చేసినట్లు ఉంది" అంటూ కొందరు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మరికొందరు మాత్రం "ఇది కేవలం ఫ్యాషన్ స్టైల్ మాత్రమే, ప్రెగ్నెన్సీ కాదు" అంటూ ఆమెను డిఫెండ్ చేస్తున్నారు. ఈ రూమర్స్‌పై సోనాక్షి, జహీర్ జంట ఏమైనా స్పందిస్తారా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు అభిమానులు. ఈ క్రమంలో సోనాక్షి తన భర్త జహీర్‌తో చేసిన వాట్సాప్ చాట్ స్క్రీన్‌షాట్ షేర్ చేసి తాను ప్రెగ్నెంట్ కాదంటూ రూమర్స్‌ను కొట్టిపారేసింది.**
– అక్షరటుడే, సినిమాడెస్క్


## యూట్యూబ్ ఛానెళ్లపై సీపీ సజ్జనార్ ఆగ్రహం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ సీపీ సజ్జనార్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. పలు విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తుంటారు. యువత చెడు మార్గాలు పట్టకుండా సూచనలు చేస్తుంటారు. కాగా.. ఆయన తాజాగా పలు యూట్యూబ్ ఛానెళ్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యూస్, లైక్స్‌తో పాటు సోషల్ మీడియాలో ఫేమస్ కావడానికి కొన్ని ఛానెళ్లు చిన్నారుల భవిష్యత్‌ను పణంగా పెడుతున్నాయని మండిపడ్డారు. పిల్లలతో అసభ్యకరమైన కంటెంట్ చేస్తూ సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. చిన్నారులకు, యువతకు ఆదర్శంగా నిలిచే వ్యక్తులను ఇంటర్వ్యూలు చేయాలని సూచించారు. పిల్లలతో అసభ్యకర వీడియోలు, ఇంటర్వ్యూలు చేయడం బాలల హక్కుల ఉల్లంఘన అని సీపీ పేర్కొన్నారు. అలాంటి వారిపై పోక్సో యాక్ట్, జువెనైల్ జస్టిస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## రిటైర్మెంట్‌పై ఊహాగానాలపై స్పందించిన కోహ్లీ

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ భవిష్యత్తుపై నెలలుగా కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. ఈ క్రమంలో మాజీ ఆటగాడు దినేష్ కార్తీక్ ఓ కీలక వ్యాఖ్య చేశాడు. కోహ్లీ 2027లో జరగబోయే వన్డే ప్రపంచ కప్‌లో ఆడాలని పకడ్బందీగా నిర్ణయించుకున్నాడని ఆయన వెల్లడించాడు. తాజాగా.. కోహ్లీ సైతం తన ట్వీట్‌తో పుకార్లకు చెక్ పెట్టాడు. 'నిజంగా నువ్వు ఓడిపోయేది ఎప్పుడో తెలుసా, నీవు ప్రయత్నం మానేసినప్పుడు అని' కామెంట్ చేశాడు. అంటే తాను ఇప్పట్లో రిటైర్ కానని ఇన్‌డైరెక్ట్‌గా చెప్పాడంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు.



## శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న ప్రధాని

**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం శ్రీశైలం మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. కర్నూల్ పర్యటనకు వచ్చిన ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, ఆలయ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వామివారికి ప్రధాని రుద్రాభిషేకం, భ్రమరాంబదేవికి ఖడ్గమాల, కుంకుమార్చన పూజలు చేశారు. ఆయన వెంట ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉన్నారు.**
– అక్షరటుడే, కర్నూల్